క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును సోమవారం హైదరాబాద్‌లో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు జ్ఞాపికలు ఇస్తున్న నిర్వాహకులు

ఇబ్రహీంపట్నం: జగిత్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఇబ్రహీంపట్నంకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు శిక్షకులు ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పోటీలో విశ్వతేజ, మనోహర్ ప్రథమ స్థానంలో, విశ్వంత్, హర్ష ద్వితీయస్థానంలో, విఘ్నేష్, హశ్విత్ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను నిర్వాహకులు, కరాటే మాస్టర్లు అభినందించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



నగదు, నిత్యావసర సరుకులు అందిస్తున్న కృష్ణారావు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైన గడ్డం సత్తయ్య కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం కాలిపోయిన ఇంటిని పరిశీలించిన ఆయన బాధిత కుటుంబసభ్యులకు రూ.5 వేల నగదు, 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు లింగం, కోరుట్ల మండల అధ్యక్షుడు రాజం, నాయకులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతలు ప్రతి గ్రామానికీ చేర్చాలి



మాట్లాడుతున్న అయోధ్య ట్రస్ట్ జిల్లా కన్వీనర్ రాజు

కథలాపూర్: అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలు ప్రతీ గ్రామానికి చేర్చేందుకు భక్తులు కృషి చేయాలని అయోధ్య ట్రస్ట్ జిల్లా కన్వీనర్ గజం రాజు కోరారు. సోమవారం కథలాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్ని గ్రామాల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. అక్షింతలను ఊరేగింపుగా ఎదుర్కొని గ్రామాల్లోని ప్రతీ ఇంటికీ అందించాలన్నారు. గ్రామాలవారీగా నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జగిత్యాలరూరల్/రాయికల్/ధర్మపురి/కోరుట్ల/మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం/కథలాపూర్/మల్లాపూర్/పెగడపల్లి/సారంగాపూర్/కొండగట్టు/వెల్గటూర్/మల్యాల: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జగిత్యాల జిల్లా కేంద్రం, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని స్వీట్లు పంపిణీ చేశారు. చర్చిల్లో పాస్టర్లు దైవ సందేశాలు చదివి వినిపించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



సారంగాపూర్‌లో క్రిస్మస్ వేడుకలు



రాయికల్‌లో క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు



నాచుపెల్లిలో..



పెగడపల్లిలో..



మెట్‌పల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మల్లాపూర్ చర్చిలో క్రైస్తవులకు సందేశం ఇస్తున్న పాస్టర్

రాములోరి అక్షింతలతో భక్తుల శోభాయాత్ర



బోర్నపల్లిలో రాములవారి అక్షింతలతో గ్రామస్తులు



ధర్మపురిలో రాములవారి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమిలో అభిషేకం చేయబడిన స్వామివారి అక్షింతల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. మొదట క్షేత్రంలోని హన్మాన్ ఆలయం నుంచి గాంధీ, నందీ చౌక్‌ల మీదుగా శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం నుంచి గోదావరి వద్ద గల శ్రీరామాలయం వరకు శోభాయాత్రను నిర్వహించారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులు, కోలాట నృత్యాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో హిందూ బంధువులు పాల్గొన్నారు.

రాయికల్: అయోధ్యలోని రాములవారి అక్షింతలు సోమవారం మండలంలోని బోర్నపెల్లి, చెర్లకొండాపూర్ గ్రామాలకు చేరాయి. ఈ సందర్భంగా మహిళలు వివిధ పార్టీల నాయకులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి గ్రామంలోని హనుమాన్, శ్రీరాముని ఆలయాలకు అక్షింతలు తీసుకెళ్లారు. అనంతరం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దండిక రాజేశం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రారంభం



బస్సు వద్ద గ్రామస్తులు, డ్రైవర్, కండక్టర్

మేడిపల్లి: భీమారం మండలంలోని పలు గ్రామాలకు నడిచే బస్సును రెండేళ్ల క్రితం నిలిపివేయగా, మండల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతుండేవారు. దీనిపై మండల కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కి ఐదు రోజుల క్రితం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన విప్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడడంతో ఈరోజు బస్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కొండాపూర్-ఒడ్యాడ్ రూట్లో ఎక్కువ గ్రామాలు భీమారం మండల కేంద్రానికి రావాలంటే మేడిపల్లికి వెళ్లి తిరిగి 10 కిలోమీటర్లు ప్రయాణం చేసి భీమారం రావాల్సి వస్తోంది. పునఃప్రారంభించిన కొండాపూర్ బస్సును భీమారం మీదుగా నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు



విప్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెం సబ్ స్టేషన్ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సోమవారం జగిత్యాల జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రాంజీ నాయక్, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలు ఎమ్మెల్యేకు వివరించగా సానుకూలంగా స్పందించి విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విప్‌ను కలిసిన వారిలో మెట్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి, రవితేజ, శ్రీధర్, శ్రీకాంత్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో విప్ పూజలు

భీమారం మండలంలోని మన్నెగూడెంలోని పల్లగుట్ట ప్రాంతంలో అయ్యప్ప పడిపూజలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, లచ్చనాయక్, దేవ్‌యాదవ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీ సభలు



ముత్యంపేటలో సామాజిక తనిఖీ గ్రామసభ

మల్యాల: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఏడాదికాలంగా చేపట్టిన ఉపాధిహామీ పనులపై సోమవారం బల్వంతాపూర్, తాటిపల్లి, రామన్నపేట, ఓబులాపూర్, మానాల, మ్యాడంపల్లి, రాజారం, మద్దుట్ల, ముత్యంపేట గ్రామాల్లో సామాజికతనిఖీ గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యదర్శులు, ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్, సామాజిక తనిఖీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ అధ్యక్షతన సమావేశం

మల్యాల: ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న కుటుంబాలకు బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ మండలంలోని తాటిపల్లిలో సోమవారం సర్పంచ్ బింగి జ్యోత్స్న సామాజిక తనిఖీ గ్రామసభను బహిష్కరించడంతో సోమవారం ఉప సర్పంచ్ పొన్నం జమున ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఉపాధిహామీ కింద చేపట్టిన పనుల వివరాలను గ్రామస్తుల ఎదుట చదివి వినిపించారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఈజీఎస్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి





జగిత్యాల, మెట్‌పల్లిలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్/ కోరుట్ల/ ధర్మపురి/మెట్‌పల్లి/రాయికల్/ పెగడపల్లి/వెల్గటూర్: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తహసీల్ చౌరస్తాలో భారత్‌సురక్షా సమితి ఆధ్వర్యంలో వాజ్‌పేయి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ, భారత్ సురక్షా సమితి నాయకులు పాల్గొన్నారు. కోరుట్ల పట్టణంలోని వాజ్‌పేయి విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ధర్మపురి పట్టణంలో వాజ్‌పేయ్ జయంతి వేడుకలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు బెజ్జారపు లవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, గోదావరి తీరంలోని భిక్షకులకు పండ్లు పంపిణీ చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో వాజ్‌పేయి జయంతి వేడుకలను ఆదివారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాయికల్ మండలంలోని భూపతిపూర్ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వాజ్‌పేయి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. వెల్గటూర్ ఎండపల్లి మండలం రాజారాంపల్లి వాజ్‌పేయి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, ఎండపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు రావు హనుమంతరావు తదితరులు వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పించారు.

మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు

మేడిపల్లి: మైనర్లు ఇటీవల వాహనాలు వేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదాలకు కారకులవుతున్నారని, వారిపై కేసు నమోదు చేస్తామని మేడిపల్లి ఎస్సై శ్యాంరాజ్ అన్నారు. మైనర్లకు బైకులు ఇచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఎవరైనా గంజాయి నిషేధిత పదార్థాలు విక్రయిస్తున్నట్లు అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా ఎవ్వరూ వాహనాలు నడపొద్దని, డ్రైవింగ్ పై అవగాహన లేని పిల్లలు బైకులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని తెలిపారు. అలాంటి వారిపై, వాహన యజమానులపై వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి: కోరుట్ల మండలంలోని నాగులపేట నుంచి మెట్‌పల్లి పట్టణానికి సోమవారం ఎటువంటి అనుమతి లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా, స్థానిక బస్‌డిపో చౌరస్తాలో పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. అనంతరం వాటిని స్టేషన్‌కు తరలించి యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొల్వాయిలో..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చిన్నకొల్వాయిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతంపవార్ తెలిపారు. చిన్నకొల్వాయి గ్రామానికి చెందిన గంగారాం అనుమతి లేకుండా ట్రాక్టర్ ఇసుక తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలరూరల్: మండలంలోని హబ్సీపూర్ గ్రామానికి చెందిన ఇమ్మడి మహేశ్ నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆదివారం ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయాన్ని మాజీ ఎంపీటీసీ ముస్కు దామోదర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తంగెళ్ల పోషన్న, పాయ్యవుల రాజన్న, పూదరి బుచ్చన్న, లచ్చిరెడ్డి, రాజన్న, గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవికి అభిషేకం



కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవికి అభిషేకం చేశారు. విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విక్రమ్, నర్సయ్య, అందాశ్ గోష్ఠి బృంద సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

కోరుట్ల: బీజేపీ కోరుట్ల పట్టణ ప్రధాన కార్యదర్శి పోతుగంటి శ్రీనివాస్,179 బూత్ బీజేపీ అధ్యక్షురాలు పోతుగంటి అరుణ సోమవారం పార్టీకి రాజీనామా చేశారు. సుమారు 30 ఏళ్లుగా ఏబీవీపీ, బీజేపీ కార్యకర్తగా పార్టీకి, ప్రజలకు సేవలు అందిస్తున్నా పార్టీ పరంగా గుర్తింపు ఉండటం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీలో కొనసాగడం సరికాదని భావించి పార్టీ పట్టణ కార్యదర్శి పదవికి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

భారీగా పెరిగిన మొక్కజొన్న సాగు

- 80 శాతం పంటసాగు జీరో టిల్లేజీ విధానంలోనే
- మంచి ధరే కారణమంటున్న అధికారులు



సారంగాపూర్ మండలంలో సాగవుతున్న మొక్కజొన్న

సారంగాపూర్: మండలంలో మొక్కజొన్న పంట సాగు గణనీయంగా పెరిగింది. యాసంగిలో ఈ ఏడాది మొక్కజొన్న పంట సాగు 800 ఎకరాలు దాటింది. గతేడాది యాసంగిలో మొక్కజొన్న పంట కేవలం 500 ఎకరాల వరకే సాగు చేశారు. అర్పపల్లి, పెంబట్ల, కోనాపూర్, నాగునూర్, పోచంపేట, లక్ష్మీదేవిపల్లి, లచ్చక్కపేట, రంగపేట గ్రామాల్లో పంట సాగు ఎక్కువగా ఉంది. రేచపల్లి మినహా మిగిలిన గ్రామాల్లో జీరో టిల్లేజీ విధానంలో పంట సాగు చేశారు. మార్కెట్‌లో మొక్కజొన్న పంట క్వింటాలుకు రూ. 2 వేలు పలకడం, సాగు ఖర్చు వరి పొలంతో పోలిస్తే మొక్కజొన్న సాగు పెట్టుబడి సగం తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. 90 రోజుల పంట, ఆరుతడి విధానంలో సాగుకావడంతో వరి కంటే లాభదాయకంటా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై ఏవో తిరుపతినాయక్, సారంగాపూర్, కోనాపూర్ క్లస్టర్ ఏఈవోలు అంజనేయులు, వెంకటేశ్ మాట్లాడుతూ రైతులకు మొక్కజొన్న సాగులో ఆధునిక పద్ధతుల్లో సాగుపై అవగాహన కల్పించామని, అర్పపల్లిలో కొంత మంది రైతులు కొన్ని కంపెనీలతో ఒప్పందం చేసుకుని విత్తనోత్పత్తి (సీడ్ ప్రొడక్షన్) కింద పంట సాగు చేశారని తెలిపారు.

అల్లీపూర్‌లో సామూహిక పడిపూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో సోమవారం రాత్రి సామూహిక అయ్యప్ప పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు సత్యంశర్మ ఆధ్వర్యంలో మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు చేశారు. అయ్యప్ప దీక్షాపరులు చేసిన భజనలతో అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. ఈ పడిపూజలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన స్వాములు పాల్గొన్నారు.